RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 336 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శనివారం, 8 జూన్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-




# ఇక పాలనపై దృష్టి

## కోడ్ ముగిసిన వెంటనే పనిలో పడిపోయిన రేవంతుడు

హైదరాబాద్ : మూడు నెలలుగా లోక్‌సభ ఎన్నికల కోడ్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా ఆగింది. నేతలు కూడా పాలనపై దృష్టి పెట్టలేదు. జూన్ 6తో ఎన్నికల కోడ్ ముగిసింది.

ఈమేరకు ఎన్నికల సంఘం ప్రకటన చేసింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి ఇక పాలనపై దృష్టి పెట్టనున్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా హామీలు నెరవేర్చలేదని ఇప్పటికే విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాధాన్యత అంశాలను ముందుగా గుర్తించి వాటిపై చర్చించాలని భావిస్తోంది.

**నిర్ణయాలకు కోడ్‌తో బ్రేక్..** మార్చి 16 నుంచి దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం విధాన పరమైన నిర్ణయాలకు ఈ కోడ్ బ్రేక్ వేసింది. మడు నెలలు అత్యవసరమైన అంశాలపై మాత్రమే చర్చించారు. ఒకే వేదికపై నిర్ణయాలు తీసుకోవడానికి ఆంక్షలు అడ్డుగా మారాయి. దీంతో ఫోన్లలోనే సంప్రదింపులు జరిపారు. జూన్ 6 కోడ్ ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం, మంత్రులు , అధికారులు సమీక్షలతో బిజీ కానున్నారు.

**పాలనపై ఫుల్ ఫోకస్..** కోడ్ ముగిసిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డి ఇక పూర్తిగా పాలనపై ఫోకస్ పెట్టనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనుకుంటున్న సర్కార్.. ముందుగా కులగణన చేపట్టాలని భావిస్తోంది. దీనిపై ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇతర రాష్ట్రాల్లో సర్వే జరిపిన తీరును పరిశీలించి ఇంటింటి సర్వే చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

**కీలకం అంశాలు సీఎం వద్దకు..** వివిధ శాఖలకు సంబంధించిన కీలక అంశాలు కూఏడా ముఖ్యమంత్రి, మంత్రుల వద్దకు తీసుకెళ్లేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రాధాన్యత అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇక ఈ నెలాఖరు లేదా జూలై మొదటి వారంలో అసెంబ్లీని కూడా సమావేశపర్చి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే ఆలోచనలో రేవంత్ సర్కార్ ఉంది.

బడ్జెట్ రూపకల్పనపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులతో చర్చించనున్నారు. రుణ మాఫీ, రైతు భరోసా, ధాన్యం కొనుగోళ్లను రేవంత్ సర్కార్ తొలి ప్రాధాన్యత అంశాలుగా భావిస్తోంది.

## మళ్లీ ప్రారంభమైన ప్రజావాణి

### ప్రజాభవన్‌కు క్యూకట్టిన జనాలు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం నేడు పునః ప్రారంభమైంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ వల్ల తాత్కాలికంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. అయితే గురువారంతో ఎలక్షన్ కోడ్ ముగియడంతో నేటి నుంచి ప్రజావాణి అర్జీల స్వీకరణ కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జీ చిన్నారెడ్డి తెలిపారు.గతంలో వలే మంగళ, శుక్రవారాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలను అర్జీల ద్వారా



ప్రభుత్వ దృష్టి తీసుకురవాచ్చున్నారు. ప్రజావాణిలో వచ్చిన వినతులకు అధిక ప్రాధాన్యతనిచ్చి సత్వర పరిష్కారాలు చూపాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కాగా, ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ప్రతిరోజూ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తాను కూడా ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తానని తెలిపారు. అయితే మొదటి రోజు మినహా ఆయన ఎప్పుడూ ఈ కార్యక్రమంలో పాల్గొనకపోవడం గమనార్హం. అదేవిధంగా రోజూ నిర్వహిస్తామన్న కార్యక్రమాన్ని వారంలో రెండు రోజులకు కుదించారు

# దెబ్బతీసిన అతి విశ్వాసం!

- ఫలితాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నారాజ్ - మొదట్నుంచీ మొక్కుబడి ప్రచారమే
- అభ్యర్థులకు సహకరించని నాయకులు - అగ్రనేతలు ప్రచారానికి వచ్చినపుడే హడావుడి
- బాధ్యతలను నిర్వర్తించడంలో అలసత్వం - పోల్ మేనేజ్‌మెంట్‌లో కమలం పార్టీ సక్సెస్

హైదరాబాద్ : గ్రేటర్‌లోని నాలుగు స్థానాల్లో మూడింటిని కమలం పార్టీ కైవసం చేసుకోవడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు నారాజ్ అవుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నా ఓడిపోయామని కాంగ్రెస్, ఎమ్మెల్యేలు గెలిచిన ప్రాంతాల్లోనూ పరాజయం తప్పలేదని ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఎందుకిలా తారుమారైందని పోస్టుమార్టం చేస్తున్నారు. నిర్లక్ష్యం, అతివిశ్వాసమే కొంపముంచాయా ? అని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాము పోటీచేసిన స్థానంలో పార్టీ బలంగా ఉన్నప్పటికీ ఎందుకు ఓటమి పాలయ్యామనే అంశాలపై విశ్లేషిస్తున్నారు. ఓటర్లను కలుసుకోవడంలో స్థానిక నాయకులు కనబరిచిన నిర్లక్ష్యం కారణంగానే తమకు పరాజయం ఎదురైందని ఆవేదనకు గురవుతున్నారు.

**నమ్మిన వారే ముంచారా ?** నమ్ముకున్న వారే తమను నట్టేట ముంచిన పరిస్థితి నెలకొందని ఆ రెండు పార్టీల అభ్యర్థులలు కుమిలిపోతున్నారు. గ్రేటర్‌లోని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల స్థానాలకు జరిగిన పార్లమెంట్ ఎన్నికలను ఈసారి ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు సీరియస్‌గా తీసుకున్నారు. ప్రధానంగా మజ్లిస్ కంచుకోటగా పేరొందిన హైదరాబాద్ లాంటి స్థానంలో గెలిచే అవకాశం లేకపోయినప్పటికీ బీజేపీ అభ్యర్థి, నాయకులు ఇక్కడ జోరుగా ప్రచారం చేశారు. పాతబస్తీలోని గల్లీల్లో పెద్దఎత్తున తిరిగారు. కాగా, గతంలో ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరితోపాటు సికింద్రాబాద్, చేవెళ్ల స్థానాలను సైతం తమ ఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్ నాయకులు వ్యూహాత్మకంగా ముందుకుసాగారు. ఆయా చోట్ల బలమైన అభ్యర్థులను పోటీలో నిలిపారు.

ఉదాహరణకు సికింద్రాబాద్ సీటును సవాల్‌గా తీసుకుని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఇక్కడ పోటీలో ఉంచారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కాగా, బీఆర్ఎస్ అధిష్ఠానం కూడా ఇటు మల్కాజిగిరి, అటు సికింద్రాబాద్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రెండింటిలో కచ్చితంగా గెలవాలని నాయకులు, పార్టీ కార్యకర్తలకు ముందు నుంచే పిలుపునిచ్చింది.

**అభ్యర్థి వచ్చినప్పుడే ప్రచారం...** మల్కాజిగిరి, సికింద్రాబాద్, చేవెళ్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి నాయకులు చాలామంది మొక్కుబడిగా ప్రచారం చేశారనే ఆరోపణలు తాజాగా వినిపిస్తున్నాయి. ఒక్కో పార్లమెంట్ సెగ్మెంట్‌లో 7 నియోజకవర్గాలుండగా.. ఆయా చోట్ల పోటీచేస్తున్న అభ్యర్థి వచ్చినప్పుడే నాయకులు చురుగ్గా ప్రచారంలో పాల్గొనడం, తర్వాత ఎక్కడి వారు అక్కడికి వెళ్లడం జరిగింది. ఈ క్రమంలో ఓటర్లను పూర్తిస్థాయిలో కలుసుకోలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రచారం చేసేందుకు వస్తున్న కార్యకర్తల కోసం డబ్బులు కావాలని పదేపదే అడిగిన వారు ఓట్లను రాబట్టుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని రగిలిపోతున్నారు.



**పోల్ మేనేజ్‌మెంట్‌లో విఫలం...** బీజేపీతో పోల్చితే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పోల్ మేనేజ్‌మెంట్‌లో విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా బీఆర్ఎస్‌లోని కొంతమంది ముఖ్యనాయకులు, కాలనీల్లో పలుకుబడి కలిగిన కార్యకర్తలు పోలింగ్ రోజున 'కాడి కింద పడేసినట్లుగా' వ్యవహరించారు. ఓటర్లను కేంద్రాల వద్దకు తీసుకెళ్లే విషయాన్ని పూర్తిగా వదిలేయడంతో ఓట్ల శాతం దారుణంగా పడిపోయింది. ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో జోరుగా ప్రచారం నిర్వహించిన నాయకులు తాజా పార్లమెంట్ ఎన్నికల్లో పట్టింపు లేకుండా ఉండడంతోనే ప్రతికూల ఫలితాలు ఎదురయ్యాయని అభ్యర్థులు చెబుతున్నట్లు తెలిసింది. గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా ఖర్చు పెట్టామని.. దాని నుంచి తేరుకోకముందే అనివార్యంగా ఎంపీగా పోటీచేయాల్సి వచ్చిందని, దీంతో మళ్లీ పెద్దఎత్తున డబ్బులు వెచ్చించామని పలువురు అభ్యర్థులు వాపోతున్నట్లు తెలిసింది.

## తెలంగాణ ప్రజలకు గుడ్ న్యూస్..!

# అమలులోకి గృహ జ్యోతి

## వారికి ఈరోజు నుంచే ఆ స్కీం అమలు..!!





హైదరాబాద్ : తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు ఇప్పటికే చర్యలు తీసుకుంది.

అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ పెంపు వంటి పథకాలను అమలు చేసింది. వంద రోజుల్లోగా ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని భావించిన ప్పటికి.. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో.. కొన్ని హామీల అమలకు అడ్డంకి ఏర్పడింది. ఇక జూన్ 4న ఫలితాలు వచ్చేశాయి. పార్లమెంట్ లోక్‌సభ ఎన్నికలు 2024కి సంబంధించి తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ చెరో 8 సీట్లలో విజయం సాధించగా.. ఎంఐఎం ఒక్క చోట మాత్రమే గెలిచింది. ఇక బీఆర్ఎస్ అయితే కనీసం ఖాతా కూడా తెరవలేదు. ఇక ఫలితాల సంగతి అలా ఉంచితే.. ఎన్నికల కోడ్ ముగియడంతో.. ఇక నేటి నుంచి తెలంగాణలో వారికి ఆ పథకాన్ని అమలు చేసేందుకు రెడీ అవుతున్నారు అధికారులు. ఆ వివరాలు.. లోక్ సభ ఎన్నికల కోడ్ ముగియటంతో.. మంత్రి పొం గులేటి శ్రీనివాస్‌రెడ్డి.. తెలంగాణ ప్రజలకు శుభవార్త చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేస్తున్న వారిలో అర్హులైన వారందరికీ.. ఈరోజు నుంచే లబ్ది చేకూరనుందని మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గృహజ్యోతి పథకం కింద సున్నా బిల్లుల జారీకి నిర్ణయం తీసుకున్నామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ఎన్నికల కోడ్ ముగియడంతో తిరిగి ప్రతి ఒక్కరికి సంక్షేమం అంటూ రాసుకొచ్చారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారు లకు సున్నా బిల్లులను జారీ చేస్తుందని.. అర్హులైన అందరికీ ప్రజా ప్రభుత్వం సంక్షేమం అందించనుందని మంత్రి శ్రీనివాస్ రెడ్డి ఈ ట్వీట్‌లో చెప్పుకొచ్చారు. కాగా.. ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ.. ఇంటి అవసరాల నిమిత్తం 200 యూనిట్ల వరకు కరెంటు వాడుకునే వారికి గృహజ్యోతి పథకం కింద.. ఉచిత కరెంట్ అందిస్తుందని హామీ ఇచ్చారు. అయితే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఫిబ్రవరి 27న సీఎం రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించగా.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, రంగారెడ్డి జిల్లాల్లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా ఈ స్కీం అమల్లోకి రాలేదు.

అయితే.. ఎన్నికల కోడ్ ముగియడంతో అర్హులందరికీ నేటి నుంచి సున్నా బిల్లులు జారీ చేయనున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. మార్చి 1 నుంచి గృహజ్యోతి ఫ్రీ కరెంట్ పథకంలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన వారికి అధికారులు జీరో బిల్లులు ఇస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా తొలి విడతలో 39.9 లక్షల మందిని గృహజ్యోతి పథకానికి అర్హులుగా గుర్తించింది ప్రభుత్వం. ఇప్పటికే వీరిలో సుమారు 10 లక్షల మందికి పైగా వినియోగదారులకు 'జీరో' కరెంట్ బిల్లులు జారీ చేసింది. వీరంతా కరెంట్ బిల్లులు చెల్లించాల్సిన పని లేదు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## షర్మిల పదవికి ఎసరు ?

ఏపీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా షర్మిల వచ్చి ఏమి సాదించారు అంటే అన్న జగన్ ని మాజీ సీఎం గా చేయడానికి అన్న సింగిల్ ఆన్సర్ వినిపిస్తుంది. సొంత అన్నకు ఆమె వ్యతిరేకంగా తీవ్ర స్థాయిలో ప్రచారం చేశారు. చాలా విషయాల్లో ఏ మాత్రం తడబాటు లేకుండా ఆమె జగన్ ని టార్గెట్ చేశారు. శత్రువులు సైతం చేయని విధంగా చేశారు అన్న కామెంట్స్ వినిపించాయి. సాధారణంగా ఇద్దరు అన్నదమ్ములు ఉంటే వారసత్వాల విషయంలో భారీగానే వివాదాలు వస్తాయి. అలా రాజకీయాల్లో ఉంటే వేరు పార్టీలలో కచ్చితంగా ఉంటారు. అయితే వారు కూడా ఒక దశను దాటి విమర్శలకు వెళ్ళలేదు అని విజయవాడ కేశినేని బ్రదర్స్ ఉదంతం రుజువు చేసింది. అదే ఆడపడుచు ఉంటే కచ్చితంగా అన్న మేలు కోరుకుంటుంది అంటారు. కానీ వైఎస్సార్ ఫ్యామిలీలో చిత్రంగా సొంత చెల్లెలే అన్న మీద విమర్శల దాడి చేశారు. ఏపీలో పాలిటిక్స్ మంచి పీక్స్ లో ఉన్నపుడు ఆమె మూడు నెలల పాటు వైసీపీ అధినేత జగన్ మీద చేసిన విమర్శలు భారీ ప్రభావమే చూపాయి. దాంతో కాంగ్రెస్ కి నోటా కంటే తక్కువ వచ్చి చతికిల పడిన పార్టీకి ఈసారి ఏకంగా 2.5 శాతం పైగా ఓట్లు వచ్చాయి. ఆ ఓట్లు అన్నీ కూడా వైసీపీవే అనడంలో సందేహం లేదు. పైగా ఎస్సీ ఎస్టీ మైనారిటీ నియోజకవర్గాలలో వైసీపీకి గట్టి దెబ్బ పడింది. మరో వైపు చూస్తే షర్మిల కడప లో ఎంపీగా కాంగ్రెస్ తరపున పోటీ చేసి లక్షన్నర దాకా ఓట్లను చీల్చారు. దాంతో పులివెందులలో జగన్ మెజారిటీ తగ్గిపోయింది. అలాగే వైసీపీ ఓటమి పాలు అయింది. ఈ నేపథ్యంలో షర్మిల వల్ల ఏపీ కాంగ్రెస్ కి ఎంతవరకూ మేలు జరిగింది అంటే ఆమె నాయకత్వ పటిమ మీద పోరాట పటిమ మీద సీనియర్లు అయితే పెదవి విరుస్తున్నారు. మరో వైపు చూస్తే పార్టీలో కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ లాంటి వారు షర్మిల మీద హాట్ కామెంట్స్ చేసిన నేపథ్యం ఉంది. ఇపుడు అదే వరసలో ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకరి పద్మశ్రీ మీడియా ముందు మాట్లాడుతూ షర్మిల మీద తీవ్ర విమర్శలు చేశారు. షర్మిల ఒంటెద్దు పోకడలు పోయారని ఆమె నిందించారు. అంతే కాదు ఆమెకు పార్టీ ఫండ్ ఇస్తే దాన్ని ఆమె దాచుకున్నారు అంటూ కూడా పద్మశ్రీ కామెంట్స్ చేశారు. కేవలం తన వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు ఆమె ఏపీ వచ్చి రాజకీయాలు చేస్తున్నారు అని ఆమె అన్నారు. ఎన్నికల ఫండ్ ని ఎవరికీ ఇవ్వకపోవడమేంటి అని ఆమె ప్రశ్నించారు. ఏపీలో కాంగ్రెస్ ఎక్కడా గెలవలేదని, షర్మిల కూడా ఓటమి పాలు అయ్యారని ఆమె దీనిని నైతిక బాధ్యత వహించి తన పదవిని రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తాను కూడా ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి రాజీనామ చేస్తాను ఆమె అంటున్నారు. మొత్తానికి షర్మిల పదవికి ఎసరు పెట్టే విధంగా సీనియర్లు చూస్తున్నారు. ఏపీలో సీఎం గా జగన్ ఉంటేనే షర్మిలకు కాంగ్రెస్ లో ఎంతో విలువ ఉంటుంది అన్నది నిజం అంటున్నారు. అన్న మీద ఆమె పోరాటం వల్ల కలసి వస్తుందని అంచనాతో ఆ పదవి ఇచ్చారు. ఇపుడు ఏపీలో టీడీపీ కూటమి వచ్చింది. దాంతో షర్మిల నాయకత్వం మీదనే చాలా మంది బాహాటంగా విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం ఈ విషయంలో ఏ రకమైన నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది. షర్మిల వల్ల పెద్దగా లాభం లేదు అనుకున్నపుడు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ చేసే పార్టీ ప్రక్షాళనలో భాగంగా ఏపీ సీటు కూడా ఎగిరిపోవచ్చు అని అంటున్నారు.




## ఒకే సెంటర్‌లో ఆరుగురికి ఫస్ట్ ర్యాంక్.. దర్యాప్తు చేయాల్సిందే: ప్రియాంక

దిల్లీ: నీట్-2024 ఫలితాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆరోపించారు. దీనిపై వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని వెంటనే దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. తొలుత నీట్ ప్రశ్నాపత్రం లీకైందన్న ఆమె... ఇప్పుడు ఫలితాల్లోనూ కుంభకోణం జరిగినట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. ఈమేరకు తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు ఆమె చెప్పారు. వీటన్నింటినీ నివృత్తి చేయాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మరోవైపు నీట్ ఫలితాల వెల్లడి తర్వాత పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుండటంపై ప్రియాంక దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. నీట్ పేపర్ లీకేజీ ఆరోపణలపై అధికారులు సరైన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. " లక్షలాది మంది విద్యార్థుల గోడును ఈ ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తోంది. నీట్ పరీక్ష ఫలితాల్లో అవకతవకలు జరిగాయని పదేపదే మొత్తుకుంటున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు. దర్యాప్తు చేపట్టి వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా?" అని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. నీట్ పరీక్ష ఫలితాలపై పలువురు అభ్యర్థులు, తల్లిదండ్రులు పలు అనుమానాలు వ్యక్తంచేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. జూన్ 4న వెలువడిన నీట్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. అందులో ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురికి 720కి 720 మార్కులు రావడం గమనార్హం. మరోవైపు నీట్ పరీక్ష పేపర్ లీకైనట్లు వార్తలు గుప్పుమన్నాయి. అయితే, దీనిని తప్పుడు ప్రచారంగా ఎన్‌టీఏ కొట్టిపారేసింది. మే 5న సాయంత్రం 4 గంటల సమయంలో ప్రశ్నపత్రం ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ సమయానికే దేశవ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో పరీక్ష మొదలైపోయిందని, అందువల్ల ప్రశ్నపత్రం లీక్ కాలేదని క్లారిటీ ఇచ్చింది.




దిల్లీ: 'ఎన్డీయే అంటేనే సుపరిపాలన. మన కూటమి అసలైన భారత్ స్ఫూర్తిని చాటుతుంది. మనది అత్యంత విజయవంతమైన భాగస్వామ్యం' అని అన్నారు నరేంద్రమోదీ. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం దిల్లీలో శుక్రవారం జరిగింది. ఇందులో తమ లోక్‌సభా పక్ష నేతగా మోదీని ఎన్డీయే నేతలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిత్రపక్షాలకు కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే ప్రదర్శనపై హర్షం వ్యక్తం చేశారు.

**ఇక NDA అంటే అర్థమిదే..** "గత 30 ఏళ్లలో ఈ కూటమి దేశాన్ని మూడుసార్లు ఐదేళ్లు పాలించింది. మరోసారి ఐదేళ్ల పాలనకు ప్రజలకు అవకాశమిచ్చారు. దేశం కోసం నిబద్ధత కలిగిన బృందం ఇది. ఎన్డీయే అంటేనే సుపరిపాలన. పేదల సంక్షేమమే మనందరి ప్రథమ కర్తవ్యం. దేశ అభివృద్ధి చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించాం. వికసిత్ భారత్ స్వప్నాన్ని సాకారం చేసి తీరుతాం. మన కూటమి అసలైన భారత్ స్ఫూర్తిని చాటుతుంది. ఎన్నికల ముందు పొత్తు పెట్టుకున్న కూటమి ఇంతగా ఎప్పుడూ విజయవంతం కాలేదు. ప్రభుత్వం ఏర్పాటు కావాలంటే సంఖ్యాబలం అవసరం. దేశాన్ని నడపాలంటే సర్వసమ్మతం కావాలి. కూటమిలో పరస్పర విశ్వాసమే ప్రధానం. అన్ని అంశాల్లో ఏకగ్రీవ నిర్ణయాలే లక్ష్యం" అని మోదీ అన్నారు. ఇక NDA అంటే 'న్యూ ఇండియా, డెవలప్డ్ ఇండియా, ఆస్పిరేషనల్ ఇండియా' అని కొత్త అర్థం చెప్పారు.

**దక్షిణాదిలో బలం పెరిగింది..** "దక్షిణాది ప్రజలు ఎన్డీయేను ఆదరించారు. కర్ణాటక, తెలంగాణలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అతి తక్కువ కాలంలోనే అక్కడి ప్రభుత్వాలు ప్రజల విశ్వాసం కోల్పోయాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఆ రాష్ట్రాల్లోని ప్రజలు భాజపాకు అండగా నిలిచారు. తమిళనాడులో సీట్లు గెలవలేకపోయినా ఓట్లు పెరిగాయి. కేరళలోనూ మా కార్యకర్తలు ఎన్నో బలిదానాలు చేశారు. తొలిసారి అక్కడి నుంచి మా ప్రతినిధి సభలో అడుగుపెడుతున్నారు. అరుణాచల్, సిక్కింలో క్లీన్‌స్వీప్ చేశాం. ఏపీ ప్రజలు కూటమికి పెద్ద ఎత్తున మద్దతిచ్చారు. చంద్రబాబుతో కలిసి చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నాం. ఏపీలో ఇంత భారీ విజయం ప్రజల ఆకాంక్షలను అద్దం పట్టింది" అని మోదీ కొనియాడారు.

**ఇది ఎన్డీయే ఘన విజయం..** "2024 ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించింది. అయినా కూడా విపక్షాలు మన విజయాన్ని తిరస్కరించేందుకు ప్రయత్నించాయి. మనం ఓడిపోయామని చిత్రీకరించాలని చూశాయి. కానీ, మనకు ఓటమి లేదని దేశ ప్రజలకు తెలుసు. ఎన్నికల ముందు ఈవీఎంలను కొందరు సందేహించారు. ఫలితాల తర్వాత అవన్నీ పటాపంచలయ్యాయి.

ఇకనైనా విపక్షాలు పార్లమెంట్‌లోకి వచ్చి చర్చల్లో పాల్గొంటాయని భావిస్తున్నా" అని మోదీ చురకలంటించారు.

## తరుగుతున్న అడవి.. తల్లడిల్లుతున్న పుడమి



మిర్యాలగూడ : దేశంలో ప్రతి మనిషి ఏటా సగటున 15 కిలోలకు పైగా ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వ్యర్థాలు వాడుతున్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తేల్చిచెప్పింది.

దేశంలో నిమిషానికి 12 లక్షల ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నాం.

గత పదేళ్లలో ఉత్పత్తి చేసిన ప్లాస్టిక్.. గత శతాబ్దమంతా వినియోగించిన దానికంటే ఎక్కువ.

వేసవిలో నిమిషానికి రెండు మిలియన్ల తాగునీటి ప్లాస్టిక్ సీసాలను కొంటున్నాం.

ప్రతి నిమిషం ఒక లారీ ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో కలుస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఇటీవలి కాలంలో మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో అనేక మంది వడదెబ్బతో మృతి చెందగా.. ప్రజలు అల్లాడిపోయారు. మరోవైపు సకాలంలో వర్షాలు లేక రైతులు తీవ్ర నష్టాలు చవిచూశారు. ఈ వాతావరణ అసమతుల్యతకు ప్రధాన కారణం వాతావరణమేనని నిపుణులు సూచిస్తున్నారు. ఈ పరిస్థితికి ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగాలతో పాటు ఇటీవల కాలంలో భారీగా చెట్ల నరికివేత, విపరీతమైన వాహనాల వినియోగమే ప్రధాన కారణాలని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై పట్టింపు కరవు..

పర్యావరణానికి అత్యంత హాని చేసే ప్లాస్టిక్‌పై నిషేధం.. క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను యథేచ్ఛగా బహిరంగంగా విక్రయాలు జరుగుతున్నప్పటికీ.. అధికారులు ఎటువంటి తనిఖీలు చేపట్టకపోవడం, చర్యలు తీసుకోకపోవడంతో గతం కంటే వినియోగం భారీగా పెరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం డిస్పోజబుల్ వస్తువులను ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసి మరీ విక్రయిస్తున్నారు. వీటిపై తరచూ అధికారులు తనిఖీలు చేస్తూ.. నిషేధిత వస్తువులు పట్టుబడితే జరిమానాలు విధించాల్సిన అవసరం ఉంది.

పర్యావరణాన్ని కాపాడేందుకు చేయాల్సినవి..

ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరు బయటకు వెళ్లేటప్పుడు ఒక జనపనార సంచిని వెంట తీసుకెళ్లాలి.

విద్యుత్తు వాడకాన్ని భారీగా తగ్గించాలి. ఏసీలు ఎంత తక్కువగా వాడితే అంత మంచిది.

మిద్దె, పెరటి తోటలకు శ్రీకారం చుట్టాలి.

చిన్న చిన్న దూరాలకు కాలినడక, సైకిల్‌ను వాడడం ఉత్తమం.

దూర ప్రాంతాలకు ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవడం మేలు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలి.

భూగర్భ జలాలు, సహజ వనరులను కాపాడాలి. %రి

లక్ష విత్తనాల సేకరణకు శ్రీకారం-అవిరెండ్ల సందీప్‌కుమార్, పర్యావరణ ప్రేమికుడు, మిర్యాలగూడ

ఇటీవలే లక్ష విత్తనాల సేకరణకు శ్రీకారం చుట్టి ఇప్పటి వరకు 18వేలకు పైగా వేప, కానుగ వంటి పలు రకాల విత్తనాలు సేకరించాం. వీటిని త్వరలోనే ప్రభుత్వ, అటవీ స్థలాల్లో చల్లేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ప్రజలు కూడా మొక్కలు నాటి వాటి సంరక్షణపై దృష్టి సారిస్తే ఎంతో మేలు చేకూరుతుంది.

## పంచాయతీ ఆస్తుల పరిరక్షణపై దృష్టి

పాల్వంచ : పంచాయతీ ఆస్తుల పరిరక్షణపై ప్రభుత్వం దృష్టిసారించింది. అన్యాక్రాంతానికి గురికాకుండా చూడటంతో పాటు, నిరుపయోగంలో ఉన్నవాటిని వినియోగంలోకి తేవాలని యోచిస్తోంది. ఈ క్రమంలో 'పల్లెప్రగతి' పనులపై క్షేత్రస్థాయి సమాచారాన్ని పంపాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా పంచాయతీ అధికారి పర్యవేక్షణలో ఇటీవల డీఎల్‌పీవోలు, ఎంపీవోలు పంచాయతీల్లో పర్యటించారు. ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, శ్మశాన వాటికలు, సెగ్రిగేషన్ షెడ్లు, ఇతర నిరుపయోగ స్థలాల వివరాలను సేకరించారు. వాటి స్థితిగతులను పరిశీలించారు. ప్రభుత్వానికి పంపేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 481 పంచాయతీలున్నాయి. వీటిల్లో పల్లెప్రకృతి వనాలు 756, బృహత్ ప్రకృతి వనాలు 110, క్రీడాప్రాంగణాలు 1,280, సెగ్రిగేషన్ షెడ్లు 481, వైకుంఠధామాలు 481, డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం కింద నర్సరీలు నిర్వహిస్తున్నారు. అవి ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి? వినియోగంలో ఉన్నాయా? ఇంకా పంచాయతీల స్థలాలు ఎక్కడెక్కడున్నాయి? వాటి స్థితి ఎలా ఉంది? అనే వివరాలను పంచాయతీరాజ్ కమిషనరేట్ నుంచి అందిన నమూనాలో ఎంపీఓలు, సిబ్బంది రూపొందించారు. ఆ వివరాలను డీపీఓ మండలానికి రెండు పంచాయతీల చొప్పున, డీఎల్‌పీవోలు అయిదు చొప్పున స్వయంగా పరిశీలిస్తున్నారు. ఆ తర్వాత రాష్ట్రస్థాయి బృందం మరొకటి వచ్చి తనిఖీలు చేయనుంది. పంచాయతీ ఆస్తుల్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవడంతో పాటు పంచాయతీ కార్యదర్శుల పనితీరును అంచనా వేయనున్నారు. 'ప్రభుత్వ ఆదేశాలతో పంచాయతీ ఆస్తులను పరిశీలించాం. వాటి సంరక్షణ, సద్వినియోగంపై సిబ్బందికి సలహాలు ఇచ్చాం' అని డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్‌తో అన్నారు.

## వలస జీవులకు రైతన్న అండ!

గంగాధర : ఒకప్పటి కరవు నేల సాగునీటి ప్రాజెక్టులతో కోనసీమగా మారింది. తెలంగాణకే ధాన్యాగారంగా మారిన జిల్లాలో వరిధాన్యం సిరులు కురిపిస్తోంది. గతంలో చిన్న కమతాల్లో మాత్రమే వరిపంట సాగు చేసే రైతులు ఇప్పుడు పెద్ద విస్తీర్ణంలో వేస్తున్నారు. నాడు కేవలం మార్కెట్ యార్డుల్లో మాత్రమే వ్యాపారులు వరి ధాన్యం కొనుగోలు చేపట్టగా.. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దాదాపు అన్ని గ్రామాల్లో ప్యాక్స్, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వేలాది క్వింటాళ్ల ధాన్యం తూకం వేస్తున్నారు. విద్యుత్తు కాంటాలు వినియోగిస్తుండగా స్థానిక హమాలీల కొరతతో బిహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు ఇక్కడకు చేరుకొని రెండు పంట సీజన్లలో హమాలీ పనులు చేస్తున్నారు. వారికి ఉపాధి లభిస్తుండగా రైతులకు సకాలంలో ధాన్యం తూకం జరుగుతుంది.

ఒక్కో బ్యాచ్‌లో ఏడుగురు..

జిల్లాలోని దాదాపు అన్ని కేంద్రాల్లోనూ స్థానికేతరులే హమాలీ పనులు చేస్తున్నారు. జిల్లాలోని 321 కేంద్రాల్లో మే 18 వరకు 2.26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. క్వింటా ధాన్యానికి రూ.35 నుంచి రూ.40 వరకు హమాలీలకు రైతులు చెల్లిస్తున్నారు. గంగాధర మార్కెట్‌తోపాటు హిమ్మత్‌నగర్, ఉప్పరమల్యాల గ్రామాల్లోని కేంద్రాల్లో



మాత్రమే స్థానిక హమాలీలు ధాన్యం తూకం వేస్తుండగా మిగతా అన్ని కేంద్రాల్లో ఇతర రాష్ట్రాల హమాలీలే ధాన్యం తూకం చేస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌లో ఏడుగురు ఉంటుండగా ఒకేసారి ధాన్యం సంచుల్లో నింపి కాంటాపై బరువు తూచి మూతికుట్లు వేస్తున్నారు. లక్ష్మీదేవిపల్లిలో ఇలా మూడు బ్యాచ్‌ల్లో 21 మంది చేరుకున్నారు. ఇలా అయిదేళ్లుగా రెండు పంట సీజన్లలో వారు ఇక్కడకు చేరుకుని హమాలీ పనులు చేస్తున్నారు.

అయిదేళ్లుగా వస్తున్నాం..

లక్ష్మీదేవిపల్లి గ్రామానికి అయిదేళ్లుగా రెండు పంట సీజన్లకు వచ్చి హమాలీ పనులు చేస్తున్నాం. ఈసారి మూడు బ్యాచుల్లో 21 మందితో వచ్చి ఇప్పటికే 50 లారీల ధాన్యం తూకం వేశాం. ప్రతి రైతుకు మేము తెలిసిపోయాం. రైతులు మమ్మల్ని ఆదరించి అదనంగా డబ్బులు ఇస్తూ అండగా ఉంటున్నారు. ధాన్యం తూకం అయిపోయాక, మా ప్రాంతానికి వెళ్లి మళ్లీ పంట సీజన్‌లో రైలులో వస్తాం.

పవన్‌మండెల్, బిహార్

కుటుంబాలను పోషించుకుంటున్నాం

మా దగ్గర పంటలు పండక ఉపాధి లభించడం లేదు. ఏటా రెండు, సీజన్లలో ఇక్కడకు వచ్చి రెండు, మూడు నెలలపాటు ధాన్యం తూకం వేస్తుంటాం. వచ్చిన డబ్బులతో కుటుంబాలను పోషించుకుంటున్నాం. మా దగ్గరి నుంచి వందలాది మంది ఈ జిల్లాకు పనులు వెతుక్కుంటూ వచ్చారు. ఇక్కడి రైతుల ఆదరణ చూసి ప్రతిసారీ వస్తున్నాం.


## చెరువు మట్టి.. చేనుకు పుష్టి

జగిత్యాల : జిల్లాలో రైతులు చెరువుల్లో పూడికమట్టిని తోటలు, పొలాలకు పెద్దఎత్తున తరలిస్తున్నారు. పసుపు కొమ్ములకు ఈ సారి ధర అధికంగా పలకటంతో వచ్చే వానాకాలం సీజన్‌లో అధికంగా పసుపు పంటను సాగుచేసేందుకు సిద్ధమవుతున్న రైతులు పెద్దఎత్తున పూడికమట్టిని తోటల్లో వేస్తున్నారు.

నేల నుంచి తీసుకున్న ఫలసాయానికి సరపడా సత్తువను తిరిగి నేలకందిస్తేనే భూమి ఫలదత దీర్ఘకాలం మనగలుగుతుంది. ఎరువులు, పురుగుమందులు, గడ్డిమందులతో పర్యవరణానికీ, మానవులు, జీవకోటికి హానీ కలుగుతోంది. కొన్ని సంవత్సరాల వరకు నేలలు నిస్సారంగా మారుతాయి. చాలామంది సిఫారసు కన్నా 15-60 శాతం వరకు అదనంగా రసాయన ఎరువులను వాడుతున్నట్లు, జిల్లా నేలల్లో భాస్వరం, నత్రజని నిల్వలు పేరుకుంటున్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తించారు. అనాదిగా వస్తున్న పచ్చిరొట్ట పైర్ల పెంపకం, పచ్చిఆకు వినియోగం, పెంట, వర్మీకంపోస్టు, బూడిద, జీవాలు, కోళ్లఎరువుతో పాటు పూడికమట్టిని నేలకు వేయటం అత్యంత ప్రయో జనకరంగా ఉంటుందని మృత్తికవిభాగం శాస్త్రవేత్త డాక్టర్ పి.రవి సూచించారు.

పోషకాలు పుష్కలం

నేల పైపొర తయారు కావడానికి వేల సంవత్సరాలు పడుతుంది. కానీ వర్షాలకు నేల పైపొరల్లోని సారవంతమైన పోషకాలు కొట్టుకువచ్చి చెరువులు, కుంటల్లో నిక్షిప్తమవుతాయి. చెరువుల్లో పేరుకుపోయిన పూడిక మట్టిని తిరిగి పొలాల్లో వేయటంవల్ల చాలా ప్రయోజనాలున్నాయి. పూడిక మన్నులో నీటిని, తేమనుపట్టి ఉంచే గుణం చాలా ఎక్కువగా ఉంటుంది కాబట్టి వర్షపు నీరు, తడులుగా అందించిన నీటిని మట్టి పట్టి ఉంచి పైర్లకు ఎక్కువ రోజులు అందిస్తుంది. దీనివల్ల పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడులనిస్తుంది. పూడిక మట్టిలోని



పోషకాలు ప్రధాన పంటకు అందుబాటులోకి వస్తాయి. ఇసుక నేలలో, తక్కువ సామమున్న నేలలకు పూడికమట్టితో చాలా ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. పూడిక మన్నులో ప్రధానంగా సేంద్రియ కర్బనం ఉండగా ఎర్రనేలలు, తేలికపాటి నేలలకు మంచి ఉపయుక్తంగా ఉంటుంది. నేలకు తేమను పట్టి ఉంచే గుణం పెరగటంతో కరవును, బెట్టను తట్టుకునే శక్తి వస్తుంది. చాలా వరకు చెరువుల్లోని మట్టి నేలకు మేలు కలిగించేదిగా ఉన్నా కొన్నిచోట్ల చౌడును కలిగించే అవకాశం కూడా ఉంటుంది. కాబట్టి చెరువుల్లోని మట్టిని పరీక్షించి చౌడును కలిగించదని నిర్ధారించుకున్న తరువాతనే పొలాలకు తోలటం మంచిది. సారవంతమైన మట్టిని ఏటా పరిమితంగా పొలాలకు వేసుకోవచ్చు. నేల గుణాన్ని బట్టి ఎకరాకు 15-40 ట్రాక్టర్ ట్రిప్పుల వరకు పూడికమట్టిని వేయవచ్చు. తోటల్లో పూడికమట్టిని వేసిన తరువాత వెదజల్లి రోటవేటర్‌తో కలియదున్ని వానాకాలంలో పంటలను వేయటంతో మంచి దిగుబడులు వస్తాయి.

# భారాస.. నిరాశ

హైదరాబాద్: రాజధానిలో లోక్‌సభ ఎన్నికల రేసులో కారు దీలాపడింది. గత పార్లమెంటు ఎన్నికల్లో ఒక స్థానం గెలవగా ఈసారి పూర్తిగా పడిపోయింది. మూడోవోట్ల మూడోస్థానంలో నిలవగా మరోచోట డిపాజిట్ గల్లంతైంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా భారాసకు ప్రతికూల ఫలితాలు వచ్చినా గ్రేటర్‌లో కారు జోరె కన్పించింది. ఇక్కడ ఏకంగా 18 స్థానాలను గెల్చుకుంది. ప్రస్తుతం సిట్టింగ్ స్థానం చేవెళ్లనూ నిలబెట్టుకోలేకపోయింది. ఈ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో నాలుగు చోట్ల శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల, మహేశ్వరంలో భారాస ఎమ్మెల్యేలే ఉన్నారు. కేసీఆర్ చేవెళ్ల నుంచే ఎన్నికల ప్రచారాన్ని మొదలెట్టారు. ఇవేవి పనిచేయలేదు.

ఉపఎన్నికలోనూ..: కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో భారాస మూడో



స్థానానికి పడిపోయింది. దివంగత ఎమ్మెల్యే లాస్యనందిత సోదరి నివేదితను బరిలో దింపినా సానుభూతి పనిచేయలేదు.

మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని ఆరు అసెంబ్లీ స్థానాల్లో భారాస ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో చేజారిన సీటును గెల్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. కేసీఆర్ దుండిగల్‌లో రోడ్‌షోలో ప్రచారం చేశారు. ఇక్కడ ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డి పోటీ చేయగా మూడో స్థానానికి పరిమితం అయ్యారు.

సికింద్రాబాద్‌లో ఇప్పటివరకు భారాస ఒక్కసారి కూడా గెలవలేదు. మరోసారి కూడా ఇక్కడ నిరాశే ఎదురైంది. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను బరిలోకి దింపినా ఆయన పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. హైదరాబాద్ నుంచి పోటీకి దిగిన గడ్డం శ్రీనివాస్ యాదవ్‌కు డిపాజిట్ గల్లంతైంది.

# రిమ్స్‌ను వరించిన గ్రీన్ ఛాంపియన్ పురస్కారం

ఆదిలాబాద్ : ఆదిలాబాద్‌లోని రాజీవ్‌గాంధీ వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్)ను గ్రీన్ ఛాంపియన్ అవార్డు–2023 వరించింది. ఆసుపత్రిలో పారిశుద్ధ్యం, పచ్చదనం, బయో మెడికల్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్ (వైద్య వ్యర్థాల నిర్వహణ) పకడ్బందీగా నిర్వహిస్తుండటంతో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(టీజీపీసీబీ) ఈ అవార్డును ప్రకటించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాథోడ్ జైసింగ్ అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా అందుకోనున్నారు.

రిమ్స్‌లోని అన్ని వార్డుల్లోనూ వైద్య వ్యర్థాల నిర్వహణను పకడ్బందీగా చేపడుతున్నారు. వ్యర్థాలను నిర్దేశిత ప్రమాణాల మేరకు ఎర్ర, నీలి, పచ్చ రంగు డబ్బాలను ఏర్పాటు చేసి అందులో వేస్తున్నారు. ఇలా వాటిలో వేసిన వైద్య వ్యర్థాలను అన్ని వార్డుల నుంచి సేకరించి మళ్లీ వేరు వేరుగా ఉంచి నిజామాబాద్‌కు ఏరోజుకారోజు తరలిస్తుంటారు. అక్కడ వాటిని నిర్దేశిత ప్రమాణాల మేరకు పర్యావరణానికి హాని కలుగకుండా దహనం చేస్తుంటారు. అదే విధంగా జూనియర్ వైద్యులతో స్థానిక ఖుర్శీద్‌నగర్, గుడిహత్నూర్ పీహెచ్‌సీల్లో వైద్య సేవలందిస్తున్నారు. అంటువ్యాధుల నివారణ దిశలోనూ ఆసుపత్రిలో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పచ్చదనం కోసం..

రిమ్స్ ఆసుపత్రిలోని వసతి గృహ సముదాయంలో పండ్ల తోటను, సంచాలకుడి కార్యాలయం ముందు మినీ పార్కును ఏర్పాటు చేశారు. రిమ్స్ అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆవరణలోనూ ముందు



భాగంతో పాటు చుట్టు పక్కల మొక్కలు, ఉద్యానవన గడ్డిని పెంచి పచ్చదనాన్ని కాపాడుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. ఆ ఆవరణంతా పచ్చదనంతో అలరారుతూ ఆకట్టుకుంటోంది.

నీటి పునర్వినియోగానికి సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్

రిమ్స్ అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో కలుషిత నీటిని పునర్వినియోగించటానికి ఎస్‌టీపీ ప్లాంటును ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో వివిధ అవసరాల కోసం వినియోగించిన నీళ్లు మురుగు కాలువల్లోకి వదలకుండా ఎస్‌టీపీ ప్లాంటులోకి మళ్లించి శుద్ధి చేస్తున్నారు. ఇలా శుద్ధి చేసిన నీటిని ఆసుపత్రి ఆవరణలో పెంచుతున్న మొక్కలకు, మరుగుదొడ్లలో వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. అదే విధంగా ఇలాంటి ఎస్‌టీపీ ప్లాంటు మరొకటి రిమ్స్ ఆసుపత్రిలోనూ నిర్మాణ దశలో ఉంది.

మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకుంటాం

డాక్టర్ రాథోడ్ జైసింగ్, రిమ్స్ సంచాలకుడు

రిమ్స్‌లో పచ్చదనం, పరిశుభ్రతతో పాటు వైద్య వ్యర్థాల నిర్వహణ, అంటు రోగాల నివారణ కోసం ఇప్పటికే పలు ఏర్పాట్లు చేసుకున్నాం. వీటిని మరింత పకడ్బందీగా అమలు చేయటానికి సిబ్బందికి తరచూ శిక్షణా కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నాం. సిబ్బంది సహకారం వల్లనే పురస్కారం వరించింది.

# చేతికందని గ్రేటర్.. కమలం తీన్మార్

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాలుగు లోక్‌సభ నియోజకవర్గాల్లో హైదరాబాద్ మినహా సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో భాజపా ఘనవిజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థులు జి.కిషన్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్ తమ సమీప ప్రత్యర్థులపై సునాయాసంగా గెలుపొందారు. పాతబస్తీని కంచుకోటగా మార్చుకున్న మజ్లిస్ పార్టీ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో తమకు ప్రత్యర్థులెవరూ లేరని, విజయాన్ని ఆపలేరంటూ మరోసారి చాటిచెప్పింది. గత లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల స్థానం గెలిచిన భారాస ఈసారి గ్రేటర్ పరిధిలో ఒక్కసీటునూ గెలవలేకపోయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి నియోజకవర్గంతో పాటు చేవెళ్ల, సికింద్రాబాద్ స్థానాల్లో విజయానికి గట్టి ప్రయత్నాలు చేసిన కాంగ్రెస్ సిట్టింగ్ స్థానాన్నీ కోల్పోయి గ్రేటర్ పరిధిలో భంగపాటు ఎదుర్కొంది. కంటోన్మెంట్ శాసనసభ ఉపఎన్నికలో గెలవడమే ఆ పార్టీకి కాస్త ఊరట.

పకడ్బందీ ప్రణాళిక.. పక్కా కార్యాచరణ

గ్రేటర్ హైదరాబాద్‌లో పాగా వేస్తే.. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో భాజపాను అధికారంలోకి తీసుకురావచ్చన్న ఆలోచనతో భాజపా అగ్రనేతలు ఇక్కడి లోక్‌సభ నియోజకవర్గాలపై దృష్టి కేంద్రీకరించారు. గతేడాది జులై నుంచే అగ్రనేతలు నరేంద్రమోదీ, అమిత్‌షా పకడ్బందీగా ప్రణాళికలను రూపొందించారు. ఎన్నికల షెడ్యూలు ప్రారంభంకాగానే... నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, పీయూష్‌గోయల్ తదితరులు, భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇక్కడ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వీరికి అదనంగా ఇతర రాష్ట్రాల నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ అభ్యర్థుల విజయం కోసం శ్రమించారు.

అసదుద్దీన్..ఐదో విజయం..

హైదరాబాద్ లోక్‌సభ మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ... వరుసగా ఐదోసారి ఘనవిజయం సాధించారు. తొలి రెండు రౌండ్లలో వెనుకబడినా..పన్నెండు రౌండ్లు పూర్తయ్యేసరికి రెండు లక్షలకుపైగా మెజారిటీని సాధించారు.

టీవీలకు అతుక్కుపోయిన నగరవాసులు

లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రభావం నగర ట్రాఫిక్‌పై స్పష్టంగా కనిపించింది. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనో ఉత్కంఠతో నగరవాసులు పూర్తిగా టీవీలకు అతుక్కుపోయారు. దీంతో ప్రధాన రహదారులు, కూడళ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఇతర జిల్లాల నుంచి వచ్చే ప్రజల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. బస్సులు కొన్నిచోట్ల ఖాళీగా దర్శనమిచ్చాయి ఫలితాల వెల్లడి నేపథ్యంలో రాకపోకల సంఖ్య సగానికి పడిపోయిందని పోలీసులు తెలిపారు. '

పార్టీలు మారినా.. ఫలితం సున్నా

నాలుగు లోక్‌సభ స్థానాల్లో ఒక్కటీ అధికార పార్టీకి గానీ, ప్రతిపక్షానికి గానీ దక్కలేదు. భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరిన పట్నం సునీతారెడ్డి మల్కాజిగిరి నుంచి, ఎంపీ రంజిత్‌రెడ్డి చేవెళ్ల నుంచి చేతి గుర్తుపై పోటీ చేశారు. భారాస ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా, తెదేపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ భారాసలో చేరి చేవెళ్ల ఎంపీగా పోటీ చేశారు. ఎన్నికల సంగ్రామంలో గెలుపు కోసం వీరంతా అన్ని రకాల ప్రయత్నాలు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది.

రికార్డు తిరగరాసిన ఈటల రాజేందర్

రాజధాని పరిధిలో ఇప్పటి వరకు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ 2,82,186 కాగా... ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ పేరిట ఉన్న ఆ రికార్డును మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్ తిరగరాశారు. సమీప కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిపై 3,91,475 ఓట్ల ఆధిక్యం సాధించారు. మరోవైపు ఐదోసారి హైదరాబాద్ ఎంపీగా గెలిచిన అసదుద్దీన్ ఒవైసీ తాజా ఎన్నికల్లో పాత రికార్డును అధిగమించి 3,38,087 ఓట్ల ఆధిక్యతతో విజేతగా నిలిచారు.

ఎంపీ స్థానాల్లో తపాలా ఓట్లు ఇలా..

సికింద్రాబాద్‌లో.. మొత్తం 8,989 ఓట్లలో భాజపాకు 4,701, కాంగ్రెస్‌కు 2,848, భారాసకు 906, నోటాకు 74 ఓట్లు పడ్డాయి. 280 రిజెక్ట్ అయ్యాయి.

హైదరాబాద్‌లో.. మొత్తం 6,917లో భాజపాకు 3,413, ఎంఐఎంకు 2,703, కాంగ్రెస్‌కు 465, భారాసకు 143, నోటాకు 39 పోలవగా, 137 రిజెక్ట్ అయ్యాయి.

మల్కాజిగిరిలో.. మొత్తం 18,880లో భాజపాకు 10,330, కాంగ్రెస్‌కు 6,230, భారాసకు 1,789, నోటాకు 160 ఓట్లు నమోదయ్యాయి. 222 తిరస్కరణకు గురయ్యాయి.

చేవెళ్లలో.. మొత్తం 19,397లో భాజపాకు 11,365, కాంగ్రెస్‌కు 6,124, భారాసకు 1,428, నోటాకు 110 ఓట్లు పడ్డాయి. 221 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక 2014, 2019లో జరిగిన రెండు లోక్‌సభ ఎన్నికలను పరిశీలిస్తే నగరంలోని నాలుగు స్థానాల్లో మూడు మినహా.. మల్కాజిగిరి ఎంపీ స్థానం మాత్రం ప్రతిసారీ విభిన్నంగా తీర్పు చెప్పింది. హైదరాబాద్ ఎంపీ సీటును వరుసగా రెండుసార్లు ఎంఐఎం దక్కించుకోగా.. సికింద్రాబాద్ ఎంపీ స్థానాన్ని భాజపా తన ఖాతాలో వేసుకుంది. ఇక చేవెళ్ల ఆవిర్భవించాక.. అలాలోక్‌సభ స్థానంలో రెండుసార్లు కారు జోరు కొనసాగింది. మల్కాజిగిరి నుంచి 2014లో తెదేపా, 2019లో కాంగ్రెస్ విజయం సాధించాయి.

గెలిచి చూపించాం

"హైదరాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి ఎలా గెలుస్తావో చూస్తాం అని సవాల్ చేశారు. గెలిచి చూపించాం. హైదరాబాద్‌లో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటున్నాను. ఎనిమిది స్థానాల గెలుపులో కీలకమైన సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు. సీట్లు గెలవకపోయినా కేసీఆర్‌ను గౌరవిస్తాం. – అసదుద్దీన్ ఒవైసీ

ఆ పార్టీల కుట్రలు తిప్పికొట్టారు

సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని ప్రజలు.. కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల కుట్రలను తిప్పికొట్టారు. త్వరలో దిల్లీకి వెళ్తున్నాను. అక్కడి నుంచి తిరిగి వచ్చిన తర్వాత.. నా విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరిని కలుస్తా. ఈ దఫా మహిళలతోపాటు యువ, దళిత, పలు మోర్చాల కార్యకర్తలు విశేష కృషి చేశారు. – జి. కిషన్‌రెడ్డి

సమస్యలు పరిష్కరిస్తా

మల్కాజిగిరి ఓటర్లకు రుణపడి ఉంటా. అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. కేంద్రం నుంచి నిధులు తెచ్చి మల్కాజిగిరి అభివృద్ధికి వెచ్చిస్తా. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీ ప్రకారం కంటోన్మెంట్ రోడ్డు సమస్యతో పాటు రైల్వే, అండర్‌పాస్ వే, నిరుద్యోగులకు ఉపాధి కల్పన, పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా. – ఈటల రాజేందర్

ఇది ప్రజలందరి విజయం

చేవెళ్ల ఎంపీగా గెలుపొందడం ప్రజలందరి విజయం. తన గెలుపు కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటా. కేంద్రంలో మరోసారి ఎన్డీఏ ప్రభుత్వమే ఏర్పడుతున్నందున ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు ఈ ప్రాంత అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

# పల్లె ప్రగతి సర్వే పూర్తి

ఆదిలాబాద్ : గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రగతిపై పంచాయతీ అధికారులు చేపట్టిన ఎసెట్ సర్వే పూర్తయింది. హరితహారం నర్సరీ, పల్లెప్రకృతివనం, వైకుంఠధామం, డంపింగ్‌యార్డు, క్రీడాప్రాంగణం స్థితిగతులను తెలుసుకునేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సర్వే చేసి నివేదికలు పంపాలని ఆదేశాలు జారీ చేసింది. మొత్తం 468 పంచాయతీల్లో జిల్లా పంచాయతీ అధికారి 5 శాతం, డివిజనల్ పంచాయతీ అధికారి 10 శాతం, మండల పంచాయతీ అధికారి 85 శాతం పంచాయతీల చొప్పున సర్వే చేయాలని సూచించింది. పల్లె ప్రగతి కింద ఏర్పాటు చేసిన అభివృద్ధి కార్యక్రమాల లక్ష్యం నెరవేరుతుందా? అన్ని వినియోగంలో ఉన్నాయా? లేక నిర్వహణ లోపం, ఇతరత్రా సమస్యలేవైనా ఉన్నాయా అని తెలుసుకునేందుకు ఈ సర్వే నిర్వహించింది. ఈ నేపథ్యంలో అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రగతి పనులను పరిశీలించారు. వాటి స్థితిగతులను యథాతథంగా చిత్రాలను తీసి నివేదికలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

నిర్వహణ లోపంతో సమస్యలు



అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వేలో కొన్ని పంచాయతీల్లో నిర్వహణ లోపంతో సమస్యలున్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా నర్సరీల్లో పెంచుతున్న మొక్కల్లో ఆశించిన ఎదుగుదల లేదు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే సమయానికి కనీసం అవి ఒకటిన్నర ఫీటు ఎత్తులో ఉండాలి. అయితే కొన్నిచోట్ల నర్సరీ నిర్వహణలో నిర్దేశిత పాటించకపోవడం, విత్తనాల ఎంపిక, మట్టి లోపం, సరైన సమయానికి నీళ్లు పట్టకపోవడం తదితర కారణాలతో ఎత్తు పెరగలేదు. పల్లె ప్రకృతి వనాల్లో సైతం అక్కడక్కడ ఎండిన మొక్కలున్నాయి. క్రీడాప్రాంగణాల్లో సరైన సదుపాయాలు లేకపోవడం, యువత, పిల్లలు ఆటలాడేందుకు ఉత్సాహం చూపడం లేదు. డంపింగ్‌యార్డుల్లో సేంద్రియ ఎరువుల తయారీలోనూ నిర్లక్ష్యం, వైకుంఠధామాల్లో వసతుల లేమి తదితర సమస్యలు అధికారుల పరిశీలనలో వెల్లడైంది. పల్లె ప్రగతి నివేదికలపై ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోనున్నారు.

నివేదికలు పంపించాం

– ఫణిందర్‌రావు, డీఎల్‌పీఓ

జిల్లాలో పల్లె ప్రగతికి సంబంధించిన ఎసెట్ సర్వే పూర్తయింది. నర్సరీ, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం, డంపింగ్‌యార్డు, క్రీడాప్రాంగణం ఏయే స్థితిలో ఉన్నాయో సర్వే చేసి ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి నివేదికలు పంపాము. నిర్వహణకు సంబంధించి ఏవైనా లోపాలుంటే వెంటనే సరిదిద్దుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు, పర్యవేక్షించాల్సిందిగా ఎంపీఓలకు సూచించాం. సర్వే నివేదికలపై ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం.

# ఇక్కడ రఘురాం అక్కడ బలరాం..

ఖమ్మం : అంకెలు రంకెలు వేశాయి. ఆధిపత్యం 'ఏక'ఛత్రాధిపత్యమైంది. రౌండ్ల సంఖ్య పెరిగేకొద్దీ ఆధిక్యం రివ్వూమంటూ దూసుకెళ్లింది.. ఎన్నడూ లేని విజయాలు.. ఇదివరకెన్నడూ చూడని భారీ గణాంకాలు వచ్చివాలాయి.. త్రిముఖ పోరులో కాంగ్రెస్ జోరు తగ్గుతుందన్న అంచనాలు తలకిందులయ్యాయి. అంచనాలకు అందని ఆధిపత్య విజయాలు ఆ పార్టీ అభ్యర్థుల వశమయ్యాయి.. మెజారిటీ కోసమే తప్ప మరోదాని కోసం వేచిచూడని పరిస్థితి ఓ పక్క.. అంతకంతకూ తగ్గుతూ వస్తున్న ఓట్లను చూస్తూ ఆసాంతం వేచిచూడలేని పరిస్థితి మరోపక్క.. అసెంబ్లీ ఫలితాలతో పోలిస్తే కాంగ్రెస్ ఉత్సాహం 'రెట్టింపైంది'.. విజయం ద్విగుణీకృతమైంది. రౌండ్ రౌండ్‌కూ 'అంతకు మించి' అన్నట్టుగా సాగింది ఫలితాల తీరు. నాటి లోక్‌సభ ఫలితాల్లో ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల కాంగ్రెస్ అభ్యర్థులు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్ ఘన విజయం సాధించారు.

పటిష్ఠ పోలీసు బందోబస్తు నడుమ మంగళవారం చేపట్టిన ఖమ్మం లోక్‌సభ ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా ముగిసింది. ఖమ్మం గ్రామీణం మండలం పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ తెల్లవారుజామున 5 గంటల నుంచి ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగింది. అర్ధగంటలోనే మొదటి రౌండ్ ఫలితాలు వెలువడ్డాయి. తర్వాత త్వరత్వరగా లెక్కింపు ప్రక్రియ కొనసాగినా ఫలితాల వెల్లడిలో జాప్యం చోటుచేసుకుంది. మధ్యాహ్నం 3 గంటల్లోగా లెక్కింపు పూర్తయింది.

విస్తృత ఏర్పాట్లు.. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్, ఖమ్మం సీపీ సునీల్‌దత్ పర్యవేక్షణలో ఎలాంటి అపశ్రుతులు, ఆటంకాలకు తావులేకుండా లెక్కింపు పూర్తయింది. పార్లమెంటు ఎన్నికల సాధారణ పరిశీలకుడు సంజయ్ జి.కోల్టె, లెక్కింపు పరిశీలకుడు ప్రేదిమాన్ కృషన్ భట్‌లు కౌంటింగ్ తీరును పరిశీలించారు.

ధ్రువీకరణ పత్రం అందజేత.. ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌతమ్, విజేతగా నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి ధ్రువపత్రం అందించారు. రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఈవీఎంల తరలింపు.. ఓట్ల లెక్కింపు అనంతరం ఈవీఎంలను ప్రత్యేక ఇనుప పెట్టెల్లో అమర్చి వాటిని బస్సుల్లో కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. కార్యాలయ ఆవరణలోని ఈవీఎంల గోదాంలో వాటిని భద్రపరిచారు.

సమష్టి కృషి వల్లే అద్భుత విషయం: మంత్రి పొంగులేటి

భారీ ఆధిక్యంతో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి విజయమందించిన ఓటర్లకు కృతజ్ఞతలు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమష్టికృషి వల్లే ఇది సాధ్యమైంది. వామపక్షాలు, ఇతర సంఘాలకు ధన్యవాదాలు. రాష్ట్రంలో భాజపాకు భారాస బీ–టీం అని మరోసారి నిజమైంది. లోక్‌సభ ఎన్నికల్లో 41 శాతం ఓట్లు కాంగ్రెస్‌కు వస్తే.. గత అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాకు వచ్చిన ఓట్ల శాతమే ఇప్పుడు భారాసకు సమకూరింది. తొలి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నట్లు భారాస డమ్మీ అభ్యర్థులను పెట్టి.. ఓటు బ్యాంకును భాజపాకు మళ్లించింది. అందుకే 15 శాతం ఓట్లకు భారాసకు పడిపోయింది. 37 శాతం ఓట్లు భాజపాకు దక్కాయి. దేశవ్యాప్తంగా భాజపా ఊహించిన దానికన్నా ఇండియా కూటమికి అత్యధిక స్థానాలు దక్కాయి. భాజపా అహంకారానికి ప్రజలు బుద్ధి చెప్పారు. రెండో రౌండులో.. రెండో రౌండు కొనసాగుతుండగానే భారాస అభ్యర్థి నామా నాగేశ్వరరావు కౌంటింగ్ కేంద్రం నుంచి వెనుదిరిగారు. నామా వెళ్లిన కొద్దిసేపటికే కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి లెక్కింపు కేంద్రానికి చేరుకున్నారు. ఉదయం 11 గంటల్లోగా అతని ఆధిక్యత లక్షన్నర దాటడంతో పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

పొంగులేటి స్వగ్రామంలో భాజపా ఆధిక్యం

పొంగులేటి సోదరుల స్వగ్రామం కల్లూరు మండలం నారాయణపురంలో రెండు పోలింగు బూత్‌లలో భాజపాకు ఆధిక్యం రావడం విశేషం. నారాయణపురంలో 94వ బూత్‌లో భాజపాకు 89 ఓట్లు మెజారిటీ వచ్చింది. మొత్తం 735 ఓట్లు పోలవగా భాజపా 404, కాంగ్రెస్ 315, భారాసకు కేవలం 16 ఓట్లు వచ్చాయి. బూత్ నంబరు 95లో 320 ఓట్లు పోలవగా భాజపాకు 197, కాంగ్రెస్‌కు 112, భారాసకు కేవలం 11ఓట్లు లభించాయి. ఈ బూత్‌లో భాజపాకు 85 ఓట్ల ఆధిక్యం దక్కింది. నారాయణపురంలో భాజపాకు 174 ఓట్ల మెజారిటీ లభించింది.

ఈవీఎంను తెరవలేదు

లోక్‌సభ ఎన్నికల్లో వైరా పట్టణంలోని గాంధీచౌక్‌తోపాటు పరిసర ప్రాంతానికి చెందిన 202 పోలింగ్ కేంద్రం ఈవీఎంను అధికారులు తెరవలేదు. ఇక్కడ మొత్తం 939 ఓట్లకు 643 పోలయ్యాయి. లెక్కింపు సమయంలో మొత్తం 50 ఓట్లు ఎక్కువగా పోలైనట్లు ఈవీఎంలో చూపించింది. కారణాలు అన్వేషించగా పోలింగ్ రోజు ఉదయం ఏజెంట్ల సమక్షంలో 50 ఓట్లతో మాక్ పోలింగ్ నిర్వహించిన అనంతరం వాటిని తొలగించాలి. కానీ ఆ 50 ఓట్లను తొలగించకుండా కొనసాగింపుగా పోలింగ్ చేసినట్లు అధికారులు గుర్తించారు. కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజార్టీ రావడంతో ఈ ఈవీఎంను తెరవకపోయినా ఇతర పార్టీల ఏజెంట్లు అభ్యంతరం తెలపకపోవటంతో ఆటంకం ఏర్పడలేదు.

మహబూబాబాద్‌లోనూ కాంగ్రెస్ ఆధిపత్యం

మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలోనూ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తన సమీప ప్రత్యర్థి, భారాస అభ్యర్థి మాలోత్ కవితపై 3.44 లక్షల ఓట్ల తేడాతో గెలుపొందారు. స్థానం పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ 2,47,706 వచ్చింది. ఈ స్థానంలో కాంగ్రెస్‌కు 4,269, భారాసకు 1,193, భాజపాకు 1,669 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వచ్చాయి. 198 ఓట్లు చెల్లకపోగా నోటాకు 80ఓట్లు పోలయ్యాయి.కాంగ్రెస్ ఖిల్లా.. రామసహాయం రఘురాంరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిఖమ్మం జిల్లా అంటేనే కాంగ్రెస్ ఖిల్లా అని మరోసారి నిరూపితమైంది. ముగ్గురు మంత్రులు, కాంగ్రెస్ ముఖ్యనేతలు, కార్యకర్తల శ్రమతో ఈలోక్‌సభ స్థానంలో అత్యధిక మెజారిటీ దక్కింది. ఓటర్ల తీర్పుతో బాధ్యత మరింత పెరిగింది. ఎంపీగా జిల్లా అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తాను.


ప్రజలతోనే ఉంటా: నామా నాగేశ్వరరావు , భారాస అభ్యర్థి

ఎన్నికల్లో గెలుపోటములు సహజం. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా. ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా సేవలందించా. పార్టీ పెద్దలకు, నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. విజేత రఘురాంరెడ్డికి అభినందనలు.

ప్రజల అభిమానం దక్కిందితాండ్ర వినోద్‌రావు, భాజపా అభ్యర్థి గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజలు భాజపాను ఆదరించారు. భాజపా శ్రేణులతో పాటు మిత్రపక్షాలు తెదేపా, జనసేన, ఎమ్మార్పీఎస్ నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. ఓటమి పాలయ్యామని అధైర్యపడకుండా రెట్టించిన ఉత్సాహంతో ముందుకెళ్తాం.

# కంకర దారిలో.. కష్టాల ప్రయాణం

తాండూరు : గ్రామీణ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరై సంవత్సరాలు దాటినా పనులు పూర్తి చేయించలేని దుస్థితి నెలకొంది. దెబ్బతిన్న తారు రహదారుల నిర్మాణానికి కంకర పరిచారు. ఏళ్లు గడిచినా.. తారు పనులు చేపట్టకుండా వదిలేశారు. వెరసి కంకర దారి మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆ దారుల్లో కనీసం ఆర్టీసీ బస్సులు కూడా నడవడం లేదు. 70 గ్రామాలు.. ఇదీ పరిస్థితి తాండూరు నియోజకవర్గంలో 143 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా మరో 70 గ్రామాలు కొనసాగుతున్నాయి. ప్రతి పల్లెకు తారు రహదారి నిర్మిస్తామని ప్రకటించిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో గతేడాది తాండూరు మండలంలో జాతీయ రహదారి నుంచి వీరారెడ్డిపల్లి రహదారి నిర్మాణానికి రూ. 72లక్షలు, జాతీయ రహదారి నుంచి సిరిగిరిపేటకు రూ. 85లక్షలు మంజూరు చేసింది. దీంతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు దెబ్బతిన్న సిరిగిరిపేట రహదారిపై తారును జేసీబీ యంత్రాలతో తొలగించారు. అనంతరం నేల చదును చేసి కంకర పరిచారు. ఎనిమిది నెలలు గడిచినా తారు పనులు చేపట్టడం లేదు. దీంతో ప్రతిరోజూ కంకర మీదుగా ప్రయాణిస్తున్న గ్రామస్థులు అవస్థలు



పడుతున్నారు. ఉన్న తారు తొలగించి కంకర కుమ్మరించి మరిన్ని కష్టాలు తెచ్చారంటూ... ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరారెడ్డిపల్లి మార్గంలోనూ రెండు కిలోమీటర్ల పొడవునా కంకరతో గ్రామస్థులు యాతన పడుతున్నారు. పలువురు ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలై ఆస్పత్రి పాలయ్యారు.వెంటనే రోడ్డు వేయాలని కోరుతున్నారు. నెరవేరని తారు కల.. వీరారెడ్డిపల్లి మార్గం నుంచి రాంపూర్‌తండా వరకు తొలిసారి తారు రహదారి నిర్మించేందుకు రూ. 90లక్షలు మంజూరయ్యాయి. వీటితో 2018–19 సంవత్సరంలో గుత్తేదారు దారిపొడవునా కంకర పరిచారు. ఐదు సంవత్సరాలు గడిచినా తారు పనుల జాడలేదు. కంకర వేయడంతో తండా తారు రహదారి సమకూరుతుందని స్థానికులు సంబురపడ్డారు. ఐదేళ్లుగా పనుల ఊసే లేకపోవడంతో తండావాసుల కల నీరుగారింది. ఇక్కడ బస్సులు తిరగలేని దుస్థితి. గోనూరు, నారాయణ్‌పూర్ మార్గంలో యాలాల మండలం లక్ష్మీనారాయణ్‌పూర్, అగ్గనూర్ వద్ద దెబ్బతిన్న రహదారి నిర్మించేందుకు కంకర పరిచారు. ఎనిమిది నెలలు గడిచినా.. తారు పనులు మొదలు పెట్టడం లేదు. వారం రోజుల్లో పూర్తయ్యే పనికి నెలల తరబడి జాప్యం చేయడాన్ని నిరసిస్తూ గతనెలలో అగ్గనూరు గ్రామస్థులు రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అయినప్పటికీ అధికారులు రహదారి నిర్మించక పోవడంతో కంకర మీదుగా రాకపోకలు సాగిస్తూ దుమ్ము కాలుష్యంతో వేలాది మంది వాహనదారులు, ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.

# ఢిల్లీ వెళ్లి మోదీని కలుస్తా.. వీహెచ్ షాకింగ్ కామెంట్స్



హైదరాబాద్: ఢిల్లీకి వెళ్లి మరోసారి ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి కులగణన చేయాలని డిమాండ్ చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు.కేంద్రంలో మూడోసారి ఎన్డీఏ గెలవడంతో మరోసారి మోదీకి ప్రజలు అవకాశం ఇచ్చారని.. ఓటర్ల తీర్పును గౌరవిస్తామన్నారు. మోదీ ఓబీసీ ప్రధాని కానీ బడుగు బలహీనర్గాల సమస్యలను ఇప్పటికైనా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. రిజర్వేషన్‌లో 50 శాతం సిలింగ్ ఎత్తివేస్తామని అన్నారన్నారు. ఈరోజు ఎన్డీఏ కూటమి కీ రోల్‌లో జేడీయూ అధినేత నితీష్ కుమార్, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఉన్నారని చెప్పారు. మోదీ వారికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. బీహార్‌లో నితీష్ కులగణన చేస్తే 67 శాతం రిజర్వేషన్ బీసీలకు వచ్చిందన్నారు. రాహుల్ గాంధీ చేసిన ఆలోచనను మోదీ కొనసాగించాలని కోరారు. ఓబీసీ కన్వీనర్‌గా తాను ఉండి రిజర్వేషన్ పెంచాలని మోదీని గతంలో కోరానని గుర్తుచేశారు. ఐఐటీలో కూడా రిజర్వేషన్ కోసం అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని.. బిల్ పాస్ అయిందని తెలిపారు. మాండల్ కమిషన్ వచ్చింది కానీ బీసీలు చట్ట సభల్లో డబుల్ డిజిట్ కూడా దాటడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నితీష్, చంద్రబాబులు కూడా అన్ని రాష్ట్రాల్లో కుల గణన చేయాలని మోదీని కోరాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70ఏళు అవుతున్న బీసీలకు న్యాయం జరగడం లేదన్నారు. తెలంగాణలో కులగణన తర్వాత లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహిస్తే.. బీసీలకు మేలు జరుగుతుందని.. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కొంత ఆలస్యమైన కులగణన తర్వాతే రాష్ట్రంలో ఎన్నికలు పెట్టాలని కోరారు. అసెంబ్లీలో కులగణన బిల్లు పాస్ చేయించిన వెంటనే కులగణనను అమల్లోకి తీసుకురావాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్‌లు మోదీకి వేంకటేశ్వర స్వామి విగ్రహం అందజేశారని చెప్పారు.

ఏపీకి ప్రత్యేక హెూదా హామీని మోదీ ఇచ్చారని.. దానిని పట్టుబట్టి అమలు చేయించాలని కోరారు. మూడోసారి ఓబీసీ ప్రధానిగా మోదీ అవుతున్నారు కాబట్టి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలు.. సెన్సెక్స్ మీద ప్రభావం చూపాయని హనుమంతరావు పేర్కొన్నారు.



# ఎన్డీయే ఎంపీల భేటీ.. మోదీ నాయకత్వానికి ఆమోదముద్ర

దిల్లీ: ఎన్డీయే ఎంపీలు దిల్లీలో పాత పార్లమెంటు భవనంలోని సెంట్రల్‌హాల్‌లో శుక్రవారం ఉదయం సమావేశమయ్యారు. మోదీ నాయకత్వానికి లాంఛనంగా ఆమోదముద్ర వేశారు. ఈ భేటీలో తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

ఈ సమావేశానికి 240 మంది భాజపా ఎంపీలతోపాటు తెదేపా, జేడీయూ, శివసేన, లోక్‌జన్‌శక్తి (రాంవిలాస్), ఎన్సీపీ, జేడీఎస్, జనసేన, అప్నాదళ్ సహా ఇతర మిత్రపక్షాల ఎంపీలు, ఎన్డీయే పార్టీల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు హాజరయ్యారు. మోదీ నాయకత్వాన్ని సమర్థిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం చంద్రబాబు, బిహార్ సీఎం నీతీశ్‌కుమార్ సహా పలువురు అగ్రనేతలతో కలిసి మోదీ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో సమావేశమవుతారు. ఎన్డీయేకు మద్దతిస్తున్న ఎంపీల జాబితాను, మద్దతు లేఖలను సమర్పిస్తారు. తన నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమివ్వాలని కోరుతారు. ఎన్డీయేకు సంపూర్ణ మెజార్టీ ఉన్న నేపథ్యంలో ఆయన్ను సర్కారు ఏర్పాటు కోసం రాష్ట్రపతి ఆహ్వానించడం లాంఛనమే.

# బీఆర్ఎస్, బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం.. - అందుకే కాంగ్రెస్ ఓటమి : దానం



హైదరాబాద్: బీఆర్ఎస్, బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందని, అందుకే కాంగ్రెస్ ఓటమి పాలైందని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆరోపించారు. బంజారాహిల్స్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విజయం కోసం డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీలు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా శ్రమించారన్నారు. కాంగ్రెస్ పార్టీపైన అభిమానం, తన పట్ల ప్రేమ, ముఖ్యమంత్రి రేవంత్ నాయకత్వంపైన విశ్వాసం కారణంగా పెద్ద ఎత్తున ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారన్నారు. తన ఓటమికి అనేక కారణాలు ఉన్నాయని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని తెలిసే తాను బీఆర్ఎస్‌ను వీడినట్లు చెప్పారు. తన ఆరోపణలు వాస్తవం చేస్తూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు బీజేపీ కోసం పనిచేశారని ఆరోపించారు. బీజేపీ అక్రమ మార్గాల్లో మద్యం, డబ్బు పంపిణీ చేస్తూ విజయం సాధించిందన్నారు. సికింద్రాబాద్‌లో నైతిక విజయం తనదేనన్నారు. పరిస్థితులు మారుతున్నాయి.. బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ తగ్గుతుంది.. అభివృద్ధి ఆకాంక్షించే ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ లోకి రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని తెలిపారు.

# జ్యుడీషియల్ రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలు.. మంత్రి ఉత్తమ్ స్ట్రాంగ్ వార్నింగ్



జయశంకర్ భూపాలపల్లి: కాళేశ్వరం, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. నిన్నటి వరకూ పార్లమెంట్ ఎన్నికలతో కోడ్ ఉండటంతో కాళేశ్వరం ప్రాజెక్టుపై రివ్యూ సాధ్యం కాలేదని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన మరుసటి రోజే కాళేశ్వరం బ్యారేజ్ పనులను పరిశీలించామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట నిరూపయోగంగా ఉందని.. ఈ ప్రాజెక్ట్ కోసం రూ. 90వేల కోట్లకు అదనంగా వడ్డీ చెల్లిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఇండియాలోనే అత్యున్నత సంస్థ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీ ఈ పనులను పర్యవేక్షిస్తుందని అన్నారు.కాళేశ్వరం డ్యామ్ పునరుద్ధరణ సాధ్యమా కాదా అని NDSAను అడిగామన్నారు. ఆ కమిటీ అధికారులు బ్యారేజ్‌లపై కొన్ని సూచనలు చేశారని తెలిపారు. మూడు బ్యారేజీల గేట్లు ఎత్తిపెట్టాలని NDSA చెప్పిందన్నారు. వర్షాకాలంలో వరదలు రాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రం నీళ్లు స్టోరేజీ చేయొచ్చని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని.. NDSA కమిటీ మాత్రం అలా చేస్తే ప్రమాదమని చెప్పారన్నారు. బ్యారేజ్ మరమ్మతు పనులు వేగవంతం చేయాలని నవయుగ కంపెనీ ప్రతినిధులను మంత్రి ఉత్తమ్ హెచ్చరించారు. సుందిళ్లలో పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. విజిలెన్స్ రిపోర్ట్ ఆధారంగా గతంలో ఉన్న ఇంజనీరింగ్ అధికారులను తొలగించామని తెలిపారు. జ్యుడీషియల్ విచారణ రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లక్ష కోట్లు ఖర్చు పెట్టి నీళ్లలో పోశారని మండిపడ్డారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి కట్టి ఉంటే ఇంతకంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీళ్లు వచ్చేవని చెప్పుకొచ్చారు. తుమ్మిడిహట్టి ప్రతిపాదనలో ఏడాదికి రూ. వెయ్యి కోట్ల వరకు విద్యుత్ అదనంగా ఖర్చు అయిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో రూ. 10 వేల కోట్లు ఖర్చు వృథా అయిందని చెప్పారు. కేసీఆర్ ఇన్ని లక్షల కోట్లు నాశనం చేశారని ధ్వజమెత్తారు.పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఫలితాలు చూసిన తర్వాత కేసీఆర్ గురించి మాట్లాడుకోడం వేస్ట్ అని ఎద్దేవా చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు నీళ్లు వచ్చే ప్రాజెక్ట్ చేపట్టడతామని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో గత ప్రభుత్వాలు అబద్ధాలు చెప్పాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బుంగ పడింది వాస్తవమే: ఈ ఎన్సీ అధికారి అనీల్** – మేడిగడ్డ బ్యారేజ్ 7వ బ్లాక్‌లో బుంగ పడింది వాస్తవమేనని ఈ ఎన్సీ అధికారి అనీల్ తెలిపారు. పీయర్స్ కింద ఇసుక కొట్టుకుపోవడం వల్లే బుంగ పడిందని.. బుంగ ఫిల్లింగ్ చేస్తున్నాయని అనీల్ చెప్పారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరిస్తాం : డా. చిన్నా రెడ్డి



హైదరాబాద్, జూన్ 7 : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగియడంతో పాలనా పరమైన అడ్డంకులు తొలగాయని, ప్రజావాణిలో అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నా రెడ్డి తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నుంచి పునః ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంలో చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కారణంగా సుమారు 3 నెలల సుదీర్ఘ విరామం తరువాత ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారులకు వివరించారు. అన్ని విభాగాలకు సంబందించి మొత్తం 373 దరఖాస్తులు నమోదయ్యాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 120 దరఖాస్తులు, విద్యా శాఖకు సంబందించి 43, మున్సిపల్ శాఖకు సంబందించి 43, హెూం శాఖకు సంబందించి 29, పౌరసరఫరాల శాఖకు సంబందించి 18, ఇతర శాఖలకు సంబందించి 120 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి అధికార వర్గాలు తెలిపాయి. ప్రజావాణి ప్రత్యేక అధికారి, మున్సిపల్ శాఖ సంచాలకులు దివ్య, ఇతర అధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు.

# హైదరాబాద్‌కు 'ఎల్లో అలర్ట్'.. భారీ వర్షం కురిసే అవకాశం



హైదరాబాద్: ఉపరితల ఆవర్తనం, షియర్ జోన్ ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని మరో నాలుగు రోజుల్లో రాష్ట్రమంతా విస్తరిస్తాయని వాతావరణశాఖ అధికారిణి శ్రావణి తెలిపారు. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదలడం, ఉపరితల ఆవర్తనం, షియర్ జోన్ ప్రభావంతో రెండ్రోజుల పాటు దక్షిణ తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ పరిధితో పాటు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదరుగు గాలుల వీచే అవకాశముందని పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ కొనసాగుతోంది. ఇప్పటికే రంగారెడ్డి, వికారాబాద్ పాటు నగరంలోని మియాపూర్, నిజాంపేట్ ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. భారీ వర్షం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే.. 040-21111111, 90001136675కు కాల్ చేయాలని సూచించింది.

# కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు




ఢిల్లీ: ఢిల్లీ మద్యం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు జ్యుడీషియల్ కస్టడీ కోరుతూ నేడు( శుక్రవారం) సీబీఐ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. దీంతో మరోసారి కవితకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగించింది. జూన్ 21 వరకు రౌస్ అవెన్యూ కోర్టు కవితకు కస్డడీని పొడిగించింది. తదుపరి విచారణను జూన్ 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. అదే రోజు సీబీఐ చార్జిషీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై రౌజ్ అవెన్యూ కోర్టు విచారణ జరపనున్నది. సీబీఐ కేసులో కవితపై దాఖలైన చార్జిషీట్‌ను కోర్టు విచారణకు తీసుకున్నది. తాను చదువుకోవడానికి కొత్తగా 9 పుస్తకాలు కావాలని కోర్టును కవిత కోరింది. కవిత అభ్యర్థనను రౌస్ అవెన్యూ కోర్టు అంగీకరించింది.

# ధాన్యం ఉత్పత్తిలో అగ్రగామిగా తెలంగాణ: మంత్రి తుమ్మల



హైదరాబాద్: హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ వేదికగా జరుగుతున్న ప్రపంచ వరి సదస్సును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. రెండు రోజులపాటు జరుగుతున్న ఈ సదస్సులో భారత్ సహా 30 దేశాలు పాల్గొన్నాయి. శాస్త్రవేత్తలు, రైస్ మిల్లర్ల సంఘాల ప్రతినిధులతోపాటు 250 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. భారత్‌లో వరిసాగు, ఉత్పత్తి, నాణ్యత, విదేశీ ఎగుమతుల పెంపుపై చర్చించనున్నారు. టెక్నాలజీ, మార్కెటింగ్, ఆహార భద్రత లక్ష్యాలుగా మేధోమథనం జరుగనుంది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమన్నారు. ఇటీవలే దశాబ్ది ఉత్సవాలు జరుపుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో రైస్ సమ్మిట్ నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని వెల్లడించారు. తెలంగాణలో క్రమంగా ధాన్యం ఉత్పత్తి పెరుగుతున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.2 కోట్ల ఎకరాల్లో ధాన్యం ఉత్పత్తి జరుగుతున్నదని పేర్కొన్నారు. ఆహార భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందన్నారు. అందరికీ ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

**తెలంగాణ వరి ఉత్పత్తి థాయ్‌లాండ్‌తో సమానం..** తెలంగాణ వరి ఉత్పత్తి థాయ్‌లాండ్‌తో సమానమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తమది రైతు అనుకూల ప్రభుత్వమని చెప్పారు. వ్యవసాయానికి అన్ని రకాలుగా ప్రభుత్వం మద్దతు ఇస్తున్నదని తెలిపారు. రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం కనీస మద్దతు ధరకు సేకరిస్తున్నదని వెల్లడించారు. వివిధ పథకాల కింద పౌష్టికాహారం పోర్టిఫికేషన్ బియ్యం సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 3 వేల అత్యాధునిక రైస్ మిల్లులు ఉన్నాయని చెప్పారు. తెలంగాణలో నీటిపారుదల వనరులు పెరుగుతున్నాయని తెలిపారు.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194


# నాంపల్లి కోర్టుకు హాజరైన దీపాదాస్ మున్షి



హైదరాబాద్: ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షి శుక్రవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. బీజేపీ నేత ప్రభాకర్ చేసిన వ్యాఖ్యల విషయంలో ఆమె పరువునష్టం కేసు వేశారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం నాంపల్లి కోర్టు విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలో దీపాదాస్ మున్షి కోర్టుకు హాజరయ్యారు. ఆమెకు మద్దతుగా కాంగ్రెస్ ఎంపీలు, మాజీ ఎంపీలు కార్యకర్తలు, నాంపల్లి కోర్టుకు వచ్చారు. బీజేపీ నేత ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై దీపాదాస్ మున్షి పరువునష్టం కేసు వేశారు. ఈ పిటిషన్‌పై ఇవాళ నాంపల్లి కోర్టు విచారణ చేస్తోంది. కాగా కాంగ్రెస్ పార్టీ నేతలకు పదవులు, ఎన్నికల్లో టికెట్లు ఇప్పించేందుకు ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి బెంజ్ కార్లు గిఫ్ట్ తీసుకుంటున్నారని బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్. సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ అంటేనే అవినీతి, అక్రమాలు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు తన ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయంటూ ప్రభాకర్ చెబుతుండటం హాట్‌టాపిక్‌గా మారింది. అయితే ప్రభాకర్ విమర్శలను కాంగ్రెస్ నేతలు తిప్పికొట్టారు. ఈ క్రమంలో ప్రభాకర్ చేసిన ఆరోపణలపై దీపాదాస్ మున్షీ సీరియస్ అయ్యారు. తనపై చేసిన అనుచిత్య వ్యాఖ్యలపై నోటీసులు జారీ చేశారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660